www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 10 జులై 2024
5
చిత్తూరు



ఉచిత ఇసుక పాలసీ ప్రజల కష్టాలు తీర్చింది

- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి-గుడిపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీతో పేద ప్రజల కష్టాలు తీరాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మునిరత్నం, మనోహర్‌తో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేదలు సొంతింటి కోసం పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా సీఎం చంద్రబాబు గతంలో ఇచ్చిన ఉచిత ఇసుక పాలసీ హామీని అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే నెరవేర్చారని హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ విధానాల వల్ల ఇసుక అమ్ముకొని వైసీపీ నేతలు కోట్లు దండుకున్నారని మండిపడ్డారు. అప్పట్లో పేదల ఇంటికి కేవలం ఇసుక కోసమే అధిక ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చేదని గుర్తు చేశారు. నూతన ఉచిత ఇసుక పాలసీ వల్ల నిరుపేదలు ధైర్యంగా తక్కువ ఖర్చుతో ఇల్లు నిర్మించుకొనే అవకాశాన్ని చంద్రబాబు ప్రభుత్వం కల్పించిందన్నారు. పూర్తి పారదర్శకంగా ఇసుక అందించేందుకు ప్రభుత్వం విజిలెన్స్ ద్వారా పర్యవేక్షిస్తుందన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టిన చంద్రబాబుకు ప్రజల తరఫున వారు కృతజ్ఞతలు తెలిపారు.

పకడ్బందీగా ఇసుక విధానం అమలు: కలెక్టర్



ఇసుక రీచ్ వద్ద కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అత్యంత పకడ్బందీగా ఇసుక విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలం దిగువమాసపల్లి ఇసుక స్టాక్ యార్డును పరిశీలించారు. అధికారులకు తగు సూచనలిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఇసుక విధానాన్ని పకడ్బందీగా చేపట్టనున్నట్లు చెప్పారు. వినయోగదారులు యూపీఐ ద్వారా నగదు చెల్లింపులు చెపట్టాలన్నారు. అందుకు సంబంధించి రసీదు ఇచ్చే విధంగా కార్యచరణ ఉంటుందన్నారు. ఇసుక డిపోలలో ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకూ మాత్రమే ఇసుక పొందొచ్చునన్నారు. మొదటగా వచ్చిన వారికి ప్రాధాన్యతా క్రమంలో నగదు చెల్లింపులకు అనుమతించడం జరుగుతుందని స్పష్టం చేశారు. వినియోగదారులు ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్, వాహన నెంబర్, డెలివరీ అడ్రస్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో చిత్తూరు తహశీల్దార్ శ్రీనివాసులు రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువలపై ఆక్రమణలు తొలగింపు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలో డ్రైనేజీ కాలువలపై ఆక్రమణలు తొలగింపు కార్యక్రమం వేగంగా జరుగుతోంది. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ మార్గనిర్దేశంలో నగరపాలక అధికారులు నగరంలో డ్రైనేజీ కాలువలను ఆక్రమించి వివిధ రకాల నిర్మాణాలు చేపట్టడాన్ని గుర్తించారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ -2024, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా మురుగునీటి కాలువల శుభ్రత కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుతోంది. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలపై అడ్డంకులు ఉండడంతో కమిషనర్ సదరు అడ్డంకులు, ఆక్రమణలను తొలగించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సంతపేట, పాత బస్టాండ్ ప్రాంతాల్లో కాలువల ఆక్రమించడం, కాలువలపై చేపట్టిన నిర్మాణాలను పూర్తిగా తొలగించారు. పాత బస్టాండ్ పండ్ల మార్కెట్ వీధిలో కాలువలపై ఉన్న అడ్డంకులు తొలగించి కాలువల్లో పూడిక తీయించారు. సంతపేట రామకృష్ణ ఆశ్రమం వీధిలో కాల్వపై నిర్మించిన నిర్మాణాన్ని పూర్తిగా తొలగించారు. కార్యక్రమంలో ప్రణాళిక విభాగం అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.


ప్రకృతి సేద్యం ఆరోగ్య సూత్రం



- రసాయనాలు వీడి.. సేంద్రీయ పద్ధతులు వాడి
- రైతు ఇంట ఆరోగ్య సిరుల పంట
- ప్రాచీన ఉత్పాదక పద్ధతులు మళ్లీ వెలుగులోకి..

ఆధునిక సమాజంలో ప్రజలు ఆరోగ్యకర ఆహారానికి దూరమవుతున్నారు. రసాయనిక పద్ధతుల్లో పండించిన పంట ఉత్పత్తులను భుజించి అనారోగ్యం పాలౌవుతున్నారు. ప్రాణాంతక వ్యాధులు కొని తెచ్చుకుంటున్న నేటి రోజుల్లో గ్రామీణ ప్రాంత వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు కనిపిస్తున్నాయి. పుడమి తల్లి ఆరోగ్యమే ప్రజారోగ్యం అని నమ్మిన అన్నదాతలు ప్రాచీన వ్యవసాయ పోకడలను అవలంబిస్తున్నారు. పూర్తి ఆరోగ్యకరమైన ఆహారాన్ని సమాజానికి అందివ్వాలన్న మౌలిక సూత్రాన్ని పాటిస్తూ సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై మక్కువ చూపుతున్నారు. ఈ క్రమంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా ఓ రైతు పంటలు పండించారు. ఆయన పండించిన అరటితోటలో అధిక లాభాలు చేకూరి ఆరోగ్య సిరుల పంట వరించింది. - ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం

భారతీయ వ్యవసాయ పద్ధతులు మనిషికి పూర్తిగా ఆరోగ్యంగా ఉంటాయని నిరూపించారు మన పూర్వీకులు. నేడు యావత్ దశం ప్రాచీన వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ మంచి దిగుబడి సాధిస్తూ ప్రపంచ దేశాలు మన రాష్ట్రం వైపు చూసే విధంగా అటు శాస్త్రవేత్తలు ఇటు రైతులు ముందడుగు వేస్తున్నారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులతో పాటు ప్రజలకు తెలియజేయడానికి వివిధ సంస్థలు ముందుకు వస్తూ నిరంతరం కృషి చేస్తున్నాయి. రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించడంలో శాస్త్రవేత్తలు చెప్పిందే రైతులు అనుసరిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు తెలిపే ప్రయత్నంలో ప్రజాశక్తి కథనం..



ఎస్ఆర్ పురం మండలం మెదవాడ పంచాయతీ ఎగువ మెదవాడ గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణ నాయుడు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్నారు. అందరిలానే ఇన్నాళ్లు రసాయనిక ఎరువులు, మందులు వినియోగించి అధిక ఖర్చులతో నష్టాలపాలైయ్యారు. అప్పుడే తన దృష్టికి వచ్చిన సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ప్రాచీన వ్యవసాయ పద్ధతుల్లో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, లాభాలు పొందొచ్చు అనే విధానాన్ని అనుసరించాలనుకున్నారు. సేంద్రీయ పద్ధతిలో తన సొంత పొలంలో ప్రయోగాత్మకంగా అరటి సాగు చేసేందుకు నిశ్చయించారు. 2022లో ఆ క్రమంలో పాలసముద్రం మండలం నొచ్చిలి గ్రామం నుంచి కర్పూరం రకం 1500 అరటి మొక్కలు తెచ్చి నాటారు. సేంద్రీయ ఎరువులు, పిచికారి చేసి అధిక దిగుబడులు సాధించారు. దీంతో ఆ రైతు ఇంట తక్కువ ఖర్చుతో సిరులు కురుస్తున్నాయి.

ఇలా పండించారు..

సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవయసాయ పద్ధలనుసరించి అరటి తోట పెంపకం ప్రారంభించారు. తొలతగా 1500మొక్కలకు గానూ ట్రాన్స్‌పోర్ట్‌తో కలిపి రూ.19వేలు ఖర్చు చేశారు. మొక్కలు నాటేందుకు రూ.2వేలు ఖర్చు చేశారు. ఎరువులు, జీవామృతం తయారీ, అటవీ చైతన్యం వీటికి గోమూత్రం, గోమయం బెల్లం, కొలవలు ఖర్చులకు దాదాపు రూ.5వేల దాకా అయింది. దిగుబడి వచ్చిన పంటను లోకల్ మార్కెట్‌లోనే అమ్ముకున్నారు. అయితే ఒక్కొక్క గెల రూ.200 చొప్పున రూ.2.80లక్షల ఆదాయం వచ్చింది. ఇంకా ఆ పొలంలో ఆరటి గెలలు పండుతున్నాయి. ఇంకా 150 వరకూ గెలలు వచ్చే అవకాశం ఉంది. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20వేల ఖర్చుతో రూ.4లక్షల వరకూ ఆదాయం చూడొచ్చని ఆ రైతు చెబుతున్న మాట. ఇక పంటలో ఏడాది పొడవునా జీవామృతం, అటవీ చైతన్యం, పుల్లటి మజ్జిగ లాంటి ఖర్చులు మాత్రమే ఉన్నాయని చెబుతున్నారు. మొక్కకు మొక్కకు మధ్యన తొలతగానే వెడల్పు ఉండడంతో కలుపు కూడా అంతంత మాత్రంగానే ఉందని పేర్కొంటున్నారు. ఇక పిలకలు అమ్మడం అదనంగా ఆదాయం పొందొచ్చునని ఆ రైతు మాట.

ఆలోచింప జేసిన ఆ సమావేశం..

ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు రైతుల్లో చైతన్యం తీసుకొస్తున్న సుభాష్ పాలేకర్ సమావేశం తనను ఎంతగానో ఆలోచింపజేసిందని బాలకృష్ణ నాయుడు అంటున్నారు. ఆ సమావేశం ద్వారా తెలుసుకున్న విషయాలను ఆచరించడంతో సత్ఫలితాలు వచ్చాయన్నది ఆయన మాట. గోవును సంరక్షించి ఆ గోవు ద్వారా వచ్చే గోమూత్రం, గోమయంతో జీవామృతం తయారు చేశారు. అలాగే రోజువారి పంట పర్యవేక్షణలో భాగంగా సుభాష్ పాలేకర్ సూచించిన విధంగా చీడపీడల నివారణ కోసం జీవామృతం స్ప్రే చేయడం పుల్లటి మజ్జిగ స్ప్రే చేయడం నెలకోసారి నీటిలో వీటిని మొక్కలకు అందించడం ద్వారా పంట ఆరోగ్యకరంగా పెరిగిందంటున్నారు. రసాయన ఎరువులు వాడటం వల్ల వచ్చే అరటి గెల కన్నా తమ అరటికాయలు ఆకర్షణీయంగా, పుష్టిగా ఉండి రుచికరంగా వచ్చాయి.

ప్రభుత్వ తోడ్పాటు లేదు..

ప్రకృతి వ్యవసాయం చేయాలనుకుంటున్న రైతులకు ప్రభుత్వ తోడ్పాటు అవసరం. ప్రభుత్వం సహకారం అందిస్తే మరింతగా పంటలు పండించేందుకు రైతులు ముందుకొస్తారు. ఏపీ సీఎన్ఎఫ్ నుంచి సాయం అందించాలి. - **బాలకృష్ణ నాయుడు, రైతు, మెదవాడ, ఎస్ఆర్ పురం మండలం**



ఎంపీని కలిసిన నగర కమిషనర్



ఎంపీని కలిసి మొక్కను అందిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఉదయం చిత్తూరులోని ఎంపీ కార్యాలయంలో ఎంపీని కలిసి మొక్కను అందించి అభినందనలు తెలిపారు. నగర అభివృద్ధికి చేపడుతున్న చర్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, మేనేజరు గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో వ్యక్తికి జైలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఎస్సీ, ఎస్టీ కేసులో వ్యక్తికి జైలు శిక్ష పడినట్లు సిఐ లక్ష్మయ్య తెలిపారు. మంగళవారం చిత్తూరు మొదటి సెషన్స్ కోర్టు జడ్జ్ రమేష్ తీర్పునిచ్చారు. గత 2014 సంవత్సరంలో బంగారుపాళ్యంకి చెందిన దామోదరం భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన చిన్నప్ప కుమారుడు మధుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాస్యూటర్ లోకనాథరెడ్డి బాధితులు దేవి తరపున వాదించి దానికి సరైన సాక్షాలు ఆధారాలను కోర్టు కానిస్టేబుల్ సురేంద్ర అందివ్వడంతో నేర నిరూపణ అయిందన్నారు. మధుకి ఒకటిన్నర సంవత్సరం జైలు శిక్ష రూ.200 అపరాధరుసం ఖరారు చేశారన్నారు. మధుని చిత్తూర్ సబ్ జైలుకు తరలించి నట్టు పేర్కొన్నారు.



టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేస్తాం

- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



టిడ్కో ఇల్లులు పరిశీలిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, కమిషనర్ అరుణ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగర పరిధిలో పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గృహాల లబ్ధిదారులకు న్యాయం చేస్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే, మేయర్ అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ, టిడ్కో అధికారులతో కలిసి పూనేపల్లె వద్దనున్న టిడ్కో గృహాలను సందర్శించారు. గృహ సముదాయంలో గృహాలను, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పెండింగ్ పనులపై టిడ్కో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2017-18లో పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఉద్దేశంతో టిడ్కో గృహాలకు శ్రీకారం చుట్టి పట్టాల పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం టిడ్కో సముదాయంలో 2వేల గృహాల్లో పెండింగ్ పనులు పూర్తి చేసి త్వరలోనే పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన గృహాల్లోనూ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని టిడ్కో అధికారులు, గుత్తేదారులను ఆదేశించినట్లు చెప్పారు. గృహ సముదాయంలో ప్రజలకు మెరుగైన నీటి సరఫరా వ్యవస్థ, లైటింగ్, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, కార్పొరేటర్లు, ఇతర నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పన

నగరపాలక పరిధిలో ఎం.అగ్రహారం శ్మశాన వాటికలో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నగరపాలక అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే నగర కమిషనర్‌తో కలిసి శ్మశాన వాటికను కలిసి పరిశీలించారు. స్థానికుల విన్నపం మేరకు స్మశాన వాటిక కాంపౌండ్ నిర్మాణం, ఇతర సౌకర్యాలు కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఎం.అగ్రహారం ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు శుభ్రమైన, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల కోరిక మేరకు పాఠశాలలో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలను పూర్తి చేయండి

- పని దినాలను పెంచండి: కలెక్టర్



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఉపాధి హామీకి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలో డ్వామా పీడీ రాజశేఖర్, ఏపీడీలు, ఏపీవోలతో సమీక్షించారు. ఉపాధి హామీ పథకం అమలు తీరు, క్లస్టర్ల వారీగా పని దినాలు, తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. నిర్దేశించిన పని దినాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి పనులు కల్పించేందుకు ఎక్కువ అవకాశం ఉన్న పనులపై దృష్టి సారించాలన్నారు. ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చేపడుతున్న ఫారం పాండ్స్, ఫీడర్ ఛానల్ పనులు, అమృత్ సరోవర్ పనులు, రోడ్డు ఫార్మేషన్, సప్లై ఛానల్, హార్టికల్చర్, ట్రెంచ్ వర్క్స్, బౌండరీస్, తదితర పనులకు సంబంధించిన అంశాలపై క్లస్టర్ల వారీగా సమీక్షించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ భాగంగా మొక్కల నాణ్యతను పరిశీలించేందుకు మండల స్థాయిలో ఉద్యాన శాఖ అధికారి ఉపాధి హామీ అధికారులు సంయుక్తంగా నర్సరీలను తనిఖీ చేసిన అనంతరం రైతులు ఆ మొక్కల్ని వినియోగించు కునేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మ్యాంగో ప్లాంటేషన్ ఎక్కువగా ఉందని, కావున మొక్కల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్లస్టర్ల వారీగా చేపట్టే పనులలో లేబర్ మొబిలైజేషన్ ఎక్కువగా ఉండాలన్నారు. పూర్తి పారదర్శకంగా పనులు చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులు దిశానిర్దేశం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జులై వరకు 40లక్షలు పని దినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 26,43,361 పని దినాలను కల్పిస్తూ 66శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగిందని, జులైకి గాను 16లక్షల పని దినాలు పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నామని డ్వామా పిడి కలెక్టర్‌కు వివరించారు.

డయేరియాతో ఇద్దరు మృతి

- మరో 14మందికి చికిత్స
- 'పాస్', రుయాలో కలెక్టర్ తనిఖీ



ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి రూరల్ పద్మావతిపురంలోని 'పాస్' మానసిక వికలాంగుల కేంద్రంలో మంగళవారం విషాదం చోటు చేసుకుంది. ఆశ్రయం పొందుతున్న మానసిక వికలాంగుల్లో ఇద్దరు అనాథలు గణపతి (35), శేషాచలం (16) అతిసారతో మృతిచెందారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. దాదాపు 9 మంది రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు పాస్ మానసిక వికలాంగ కేంద్రాన్ని, రుయాలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వీరిలో ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం కలెక్టర్ స్విమ్స్‌కు రిఫర్ చేశారు. ఘటనకు కారణాలను వైద్యాధికారులను, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. నీటిని, ఆహారాన్ని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు.

డయేరియా బాధితులను పరామర్శించిన కలెక్టర్

రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించి, వారికి మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ వైద్య అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న (పాస్ మనో వికాస్) మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల డయేరియా బాదితులు ఉండే వార్డులను సందర్శించి వైద్య సిబ్బందికి సూచిస్తూ బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 16 మంది డయేరియా బాధితులలో ఇద్దరు మరణించారని, మిగిలిన వారి ఆరోగ్యం నిలకడగా ఉందని, వారికి స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. అందులో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం స్థానిక స్విమ్స్ ఆసుపత్రికి తరలించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల ఎన్‌జిఓ ఆధ్వర్యంలో నడుస్తోందన్నారు. ఈ ఆశ్రమంలో సుమారు 6 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల లోపు వయసు గల 72 మంది ఆశ్రయం పొందుతున్నారు. జూలై 6వ తేదీన మధ్యాహ్నం అల్పాహారం తీసుకున్న తర్వాత ఆదివారం ఉదయం నుండి కొంతమందికి వాంతులు, విరోచనాలు అయిన వారికి మెట్రోజెల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వారికి అందించడం జరిగిందని, అయినప్పటికీ వారికి డయేరియా కంట్రోల్ కాకపోవడం వలన వారికి మెరుగైన చికిత్స కోసం సోమవారం ఉదయం వారిని సదరు ఎన్జీఓ రుయా ఆసుపత్రికి తీసుకొచ్చారన్నారు. జిల్లా యంత్రాంగం పూర్తిగా డయేరియా నియంత్రణకు చర్యలు చేపడుతోం దన్నారు. ఆశ్రమంలో ఉన్న మిగిలిన పిల్లలు డయేరియా బారిన పడకుండా వారికి ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకునే విధంగా అన్నిరకాల చర్యలు జిల్లా యంత్రాంగం చేపడుతోందని తెలిపారు. అనంతరం స్థానిక పద్మావతి పురంలోని (పాస్ మనో వికాస్) మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసారు. మానసిక దివ్యాంగుల ఆదర్శ ప్రత్యేక పాఠశాలలో డయేరియా ప్రబలడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో తాగునీరు, వంటగదిని, పరిసరాలను పరిశీలించారు. ఆశ్రమంలో ఎప్పటికప్పుడు బ్లీచింగ్‌తో శుభ్రపరిచి స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన ఆహారం వారికి అందించాలని ఆశ్రమ సిబ్బందికి తెలిపారు. ఆశ్రమంలోని ఇతర పిల్లలకు డయేరియా బారిన పడకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యులు అందుబాటులో ఉండేలా ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డిఓ రిశాంత్ రెడ్డి, డిఎంహెచ్ఓ శ్రీహరి, రుయా సూపెరింటెండెంట్ రవి ప్రభు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల శాఖ అధికారి శ్రీనివాస్, ఆశ్రమ పాఠశాల జనరల్ సెక్రెటరీ బాలకష్ణమూర్తి, ప్రిన్సిపాల్ మురళీకష్ణ పాల్గొన్నారు.

ఇసుకను వైసిపి ప్రభుత్వం ఆదాయ వనరులుగా మార్చుకుంది: ఎంపీ



టీడీపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రజా సంక్షేమం కోసమే సీఎం చంద్రబాబు ఇసుకను ఉచితం చేశారని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. మంగళవారం చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇసుకనే ప్రధాన ఆదాయ వనరులుగా మార్చుకుని సుమారు రూ.50వేల కోట్ల వరకు దోచుకుని పంచుకున్నారని ఆరోపించారు. టిడిపి అధినేత చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఇసుకను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఇసుకను ఉచితం చేస్తే నిర్మాణరంగం వేగవంతం కావడంతో పాటు పేదల సొంత ఇంటి కల నెరవేరి అనేక మందికి ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం ఉందన్నారు. ముందుచూపుతో చంద్రబాబు ఈ నిర్ణయానికి వచ్చారన్నారు. భవన నిర్మాణ రంగం ఊపొందుకుంటే పలు రకాలుగా అనేక మందికి పలు రకాలుగా ఆదాయ మార్గాలు మెరుగుపడతాయన్నారు. గత ప్రభుత్వ విధానంతో రాష్ట్రంలో భవననిర్మాణ రంగం చితికిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రవాణా చార్జీలు చెల్లించి ప్రస్తుతం ఇసుకను తీసుకు వెళ్ళవచ్చునని తెలిపారు. వైసీపీ నేతలు దీన్ని జీర్ణించుకోలేక ఆరోపణ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కొత్త ఇసుక పాలసీలో అక్రమాలకు అవకాశాలు లేకుండా విజిలెన్స్ కమిటీలు పర్యవేక్షణతో పాటు జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ నిత్యం పరిశీలిస్తుందన్నారు. ఈ కొత్త ఇసుక పాలసీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే గాంధీ, నేతలు కోదండ యాదవ్, సురేంద్ర కుమార్, మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి రాం..రాం.!

- పట్టించుకొనే వారు లేక.. పరిశుభ్రత కానరాక
- నగరి పట్టణంలో అడుగడుగునా అపరిశుభ్రం

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్:

నగిరి మునిసిపాలిటీలో పారిశుద్ధ్య చర్యలు కానరావడం లేదు. అడుగడుగునా అపరిశుభ్రంగా ఉంటోంది. మండపం సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి పాచ పట్టడంతో దుర్వాసన వస్తుంది. పి.సి.యన్. ప్రభుత్వ జూనియర్ కళాశాలం, డిగ్రీ కళాశాల సమీపంలో ఉంది. విజయపురం, నింద్ర, నగిరి పట్టణానికి చెందిన విద్యార్థులు జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలకు వెళ్లాలంటే ఈ మార్గంలోనే వెళ్ళాలి. రోడ్డుపై వర్షపు నీరు నిలిచి పాచి పట్టడంతో దుర్వాసన వస్తోంది. దీంతో విద్యార్థులు ముక్కు మూసుకొని వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా నిల్వ ఉన్న నీటిలో బర్రెలు చేరుతుండడంతో ఈ వాసన మరింత అద్వానంగా మారింది.

కానరాని పారిశుద్ధ్య పనులు

పట్టణ పరిధిలోని ప్రతి వాడల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని చెప్తున్న అధికారుల మాటలు ఆచరణలో కనిపించడం లేదు. ఫలితంగా దోమలకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. మురుగు కాలువలు పారక, చెత్త, వర్షపు నీరు నిలి పరిస్థితి అస్థవ్యస్తంగా మారిందని అక్కడి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ఐడి కార్డు పోగొట్టుకున్న ఉద్యోగి

ప్రజాశక్తి-వెదురుకుప్పం, కార్వేటినగరం: కార్వేటినగరం పంచాయతీ సుద్దగుంట గ్రామానికి చెందిన యు.విజయ్ పుత్తూరు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తరఫున జపాలి అసోసియేట్స్‌లో క్రెడిట్ కార్డు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్గా పనిచేస్తున్నాడు. మంగళవారం కార్వేటినగరం మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఐడీ కార్డు పోగొట్టుకున్నట్లు విజయ్ తెలిపారు. ఐడి కార్డు ఎవరికైనా దొరికుంటే 9959965159 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లి, ఇరికిపెంట, కందూరు పంచాయతీల పరిధిలోని గ్రామాలలో జోరుగా పారిశుద్ధ్య పనులను, వీధి దీపాల ఏర్పాటు, ఓవర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్ పనులు ముమ్మరంగా చేపట్టారు. డెంగ్యూ నివారణ కార్యక్రమాలలో భాగంగా పంచాయతీల పరిధిలోని మురుగునీటి కాలువలను శుభ్రం చేయడం పిచ్చి మొక్కలు తొలగించడం ఓవర్ హెడ్ ట్యాంకులను క్లీనింగ్ చేయడం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వీధి దీపాలు వెలగని ప్రాంతాలలో నూతన దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శులు మణికుమార్, మేనక, జయశంకర్ తెలిపారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-సోమల: డెంగీ నివారణ మాసోత్సవాల సందర్భంగా మండలంలోని కందూరు పంచాయతీ కేంద్రం, ఇరికిపెంటలో వైద్య సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయలక్ష్మీ కందూరులో డెంగీ నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిశరాల పరిశుభ్రత, దోమలు ప్రబలకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఇరికిపెంటలో సచివాలయం వద్ద వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి ర్యాలీ నిర్వహించి నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌వో అమర్నాథ్, ఏఎన్ఎం మదనిక, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం, కార్వేటినగరం: జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ దృష్టికి సమస్యలు తీసుకురావొచ్చునని టీడీపీ నేతలు తెలిపారు. బుధవారం కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో 'సమస్య మీది పరిష్కారం మాది' కార్యక్రమం పేరిట ఎమ్మెల్యే ప్రజా సమస్యలు వింటారని వారు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లును మంగళవారం టీడీపీ నేతలు పర్యవేక్షించారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెంగల్‌రాయులు యాదవ్, రాజేందర్ రెడ్డి, నాగేశ్వరాజు, రవి యాదవ్, చెంగలరాయలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: పంచాయతీ కార్యదర్శులు వారి గ్రామాల్లో ఎప్పటికప్పుడు తాగునీటి ట్యాంకులను శుభ్రపరచాలని అదేవిధంగా ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో అబ్దుల్ రహీం సూచించారు. మంగళవారం మండలంలోని లింగాపురం పంచాయతీలో సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని తాగునీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రంగా ఉన్న విషయాన్ని గుర్తించి అప్పటికప్పుడు శుభ్రం చేయించారు. పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి వర్షాకాలంలో ప్రబలుతున్న అంటూ వ్యాధులు నిర్మూలనకు ప్రజల అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను హాజరను తనిఖీ చేశారు.

'పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలి'

ప్రజాశక్తి-పెద్దపంజాణి: బడి ఈడు పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబు రెడ్డి అన్నారు. మంగళవారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు అందరు బడిలో ఉండాలని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం అనేక రకాలైనటువంటి సదుపాయాలు కల్పిస్తున్నారని వంద శాతం పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు తెలిపారు. విద్యార్థులందరూ గ్రామంలో ర్యాలీగా వెళ్లి బడికి నిలిచిపోయిన పిల్లలను బడికి వచ్చేలా విద్యా ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, అంజప్ప, మాధవన్, గంగాధర్, రాజేష్, నాయకులు భూపతి, శివ, కుమార్ రెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

విద్యా సామగ్రి కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నంజంపేట ప్రాథమిక పాఠశాలలోని 104మంది విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్టూడెంట్స్ కిట్టును ప్రధాన ఉపాధ్యాయులు వెంకటరమణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని ముఖ్యంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు నోట్ పుస్తకాలు యూనిఫామ్ అందజేస్తుందన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం భోజనం పౌష్టికాహారం కోసం కోడిగుడ్డు అందిస్తోందని తెలిపారు. విద్యార్థుల కోసం స్టూడెంట్ కిట్ కింద స్కూల్ బ్యాగు, షఉలు, సాక్షులు, బెల్టు కూడా పంపిణీ చేసిందని వీటిని పాఠశాలలోని విద్యార్థులకు అందజేయడం జరిగిందని తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగ



ప్రజాశక్తి-వెదురుకుప్పం: కార్వేటినగరంలోని బాలుర వసతి గృహం సమీపంలో మంగళవారం కరెంటు స్తంభం నుంచి విద్యుత్ తీగ తెగిపడింది. ఈ వీధి నుంచి సుబ్రహ్మణ్యస్వామి గుడికి, బాలుర వస్తే గృహానికి ఇటువైపే వెళ్లాలి. ఎవరు అటువైపు పోక పోవడంతో స్థానికులు ఊపిరిపించుకున్నారు. సమయం గడుస్తున్న, పట్టించుకోని విద్యుత్ సిబ్బంది అటువైపు కన్నెత్తీ కూడా చూడలేదని స్థానికులు వాపోతున్నారు. కనీసం కరెంటు కూడా ఆఫ్ చేయని పరిస్థితి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఇన్వెస్టిట్యూర్ వేడుకలు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు సుందరాజపురం విజయం పాఠశాలలో "ఇన్వెస్టిట్యూర్ (పెట్టుబడి) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి పాల్గొని విద్యార్థులచే ఓటింగ్ ద్వారా ఎంపికకాబడిన పాఠశాల క్యాబినెట్‌లోని సభ్యులు హెడ్ బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్, అసిస్టెంట్ స్పోర్ట్స్ కెప్టెన్, హౌస్ కెప్టెన్లకు బ్యాడ్జ్, స్లాష్ రిబ్బన్లను ప్రదానం చేసి వారిచే విశ్వాసం, ఆశ, నిబద్ధత, కరుణ, విధేయతలను గూర్చి బాధ్యతను అప్పగిస్తూ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు డాక్టర్ తేజోమూర్తి ఎంపిక కాబడిన క్యాబినెట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ "విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొని తమ నాయకులను ఎన్నుకోవడం హర్షించ దగ్గ విషయం అని, విద్యార్థి దశ నుంచే మంచి నాయకులను ఎన్నుకోవడం, నాయకత్వాన్ని నిర్మించడం వంటి సామర్థ్యాలను కలిగి ఉండడం అవసరం అన్నారు. గొప్ప నాయకుల స్ఫూర్తితో దేశ భవితలో భాగం కావాలని విద్యార్థులకు సూచించారు. అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ శైలజమూర్తి ప్రసంగిస్తూ "ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా జీవిస్తూ జీవనప్రమాణాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఆ ఉద్దేశంతోనే పాఠశాల హౌస్ కలర్స్‌గా పంచభూతాలకు ఉపమానాలుగా గల రంగులను ఎంపిక చేశామని వాటిద్వారా బుద్ధి కుశలత, ఏకాగ్రత, క్రమశిక్షణ కలిగి ఉన్నత ప్రమాణాలతో విద్యను అర్జించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.బి కౌసల్య, పీఈటి మాస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు భూములు సిద్ధం: ఎమ్మెల్యే



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించేందుకు భూములు సిద్ధంగా వున్నాయ ని, నగరి నియోజక వర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. మంగళవారం చెన్నై అంబత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మ్యాను ఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ నగరి నియోజకవర్గం పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉంటుందని, పరిశ్రమల స్థాపనకు తగిన సహాయ, సహకారాలు అందిస్తామని పారిశ్రామిక ప్రతి నిధులను ఆహ్వానించారు. ఇప్పటికే తన తండ్రి గాలి ముద్దుకృష్ణ మనాయుడు విజయపురం మండలం కోసల నగరంలో అప్పటి టిడిపి ప్రభుత్వం లో ఏపీఐఐసీ ద్వారా 1579 ఎకరాలు సేకరించి పరిశ్రమలు ఏర్పాటుకు సిద్ధం చేశారని తెలిపారు. విజయపురం మండ లంలో భూమి సిద్ధంగా వుందని త్వరిత గతిన పరిశ్రమలు స్థాపిం చి ఉపాధి అవకాశాలు కల్పిం చాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ మ్యాను ఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, చిత్తూరు పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, విజయపురం మండలం నాయకులు లక్ష్మీపతి రాజు, మాజీ జెడ్పిటిసి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దారుకు ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు మంగళవారం విన్నవించుకున్నారు. తిరుపతి జిల్లా డిఆర్‌డి పరిధిలోని డక్కిలి మండలంలో 27 గ్రామ సంఘాలు డక్కిలి ఎంఎస్ లో 2016 ఏప్రిల్ నుండి 2023 నవంబరు 30 వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలపై క్షేత్రస్థాయిలో విచారణ టీమ్ సమర్పించిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డక్కిలి మండల తహశీలారుకి, మండల ఎంపీడీవో కి, మండల ఎస్ఐకి వెలుగు వెంకటగిరి ఏరియా కోఆర్డినేటర్‌కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెలుగు కార్యాలయంలో విలేకరులతో ఆంధ్రప్రదేశ్ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య మాట్లాడుతూ విచారణ బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం వెలుగు కార్యాలయంలో అవినీతికి పాల్పడిన సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవినీతి నగదును వెంటనే రికవరీ చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. లేని పక్షంలో మండల కేంద్రంలో ఆగస్టు 15 నుండి రిలే నిరాహార దీక్షను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక మండల అధ్యక్షులు కరిపం సీనయ్య, ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు రవి, మాల మహానాడు నాయకులు నన్ను మునయ్య, అంకుపల్లి పాపయ్య ఎమ్మార్పీఎస్ నాయకులు గద్దల చెంచయ్య పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతిటౌన్: నగరంలోని ప్రతి ఒక్కరూ మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు దరిచేరవని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని తిమ్మినాయుడు పాలెం, హరిజన వాడ, రెడ్డిగుంట, ఉప్పరపాలెం తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం తెల్లవారుజాము నుండి కమిషనర్ పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరాను తనిఖీ చేశారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలన్నారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డి.ఈ. విజయకుమార్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, సుమతీ ఉన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి -తిరుమల:

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 16వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ ఈవో జె శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ సంవత్సరంలో నాలుగుసార్లు ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారని చెప్పారు. స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం ప్రారంభించారు. ఈ సందర్భంగా అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్వో నరసింహ కిషోర్, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

ప్రజా క్షేమమే కూటమి లక్ష్యం: సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

రాష్ట్ర ప్రజలక్షేమం, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టిడిపి తిరుపతి బాధ్యులు మన్నూరు సుగుణమ్మ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వాలంటీర్ల వ్యవస్థ లేకపోతే పింఛన్లు పంపిణీ జరగదని హేళన చేసిన వారే ముక్కున వేలేసుకునేలా ఒక్క రోజులోనే కూటమి ప్రభుత్వం 99 శాతం ఇచ్చామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువత నైపుణ్యాలను తెలుసుకొని వారి విద్యార్హతతో మంచి ఉపాధి అవకాశాలు కల్పించాలని స్కిల్ సెన్సెస్ చేయబోతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 43 జీవో ద్వారా ఇసుక ఫ్రీ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడవక ముందే ప్రజలకు ఇచ్చిన ఐదు హామీలతో పాటు సంక్షేమం కోసం కార్యాచరణ ప్రారంభించిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఇసుక ద్వారా వేలకోట్ల రూపాయలు వెనకేసుకున్నారని, ఒక్క జేపీ వెంచర్స్ నుండే రాష్ట్ర ప్రభుత్వానికి 800 కోట్ల రూపాయలు బకాయిగా ఉందన్నారు. ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేస్తూ పేదింటి వారి కలను నిజం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో దంపూర్ భాస్కర్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, సురా సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో రాణించాలి : విసి

ప్రజాశక్తి - క్యాంపస్ :

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో రాణించాలని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ జియస్ కృష్ణ మూర్తి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో సోమవారం ఆచార్య (పి.జి) కోర్సుల్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు విశ్వవిద్యాలయంలో బోధించే 15కు పైగా వివిధ శాస్త్రాల ప్రాథమిక పరిచయాన్ని విద్యార్థులకు పాఠ్యక్రమాన్ని (బ్రిడ్జ్ కోర్స్) విశ్వవిద్యాలయ సభాభవనంలో విసి ప్రొ.జి.యస్.కృష్ణ మూర్తి, అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత శుక్ల, బ్రిడ్జ్ కోర్స్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సిరంగనాథన్, అడిషనల్ కోఆర్డినేటర్ డా.యశస్వి తో కలిసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నూతనంగా ప్రవేశించే విద్యార్థులకు సంస్కృత విశ్వవిద్యాలయంలో బోధించే 15 పైగా శాస్త్రాలు, వాటిలో అంశాలను ప్రాథమిక పరిచయంగా ఈ బ్రిడ్జ్ కోర్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సంస్కృతంలో పూర్వ పరిచయం ఇప్పుడే కొత్తగా చదివే వాళ్లందరూ ఈ బ్రిడ్జి కోర్స్ కార్యక్రమం ద్వారా సంస్కృత భాష, సంస్కృత శాస్త్రాలు వాటికి సంబంధించిన జ్ఞానాన్ని సరళంగా సులభంగా తెలుసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. విద్యార్థులందరూ కూడా బాగా చదువుకుని ఈ విద్య అనే పర్వతాన్ని అధిరోహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కోఆర్డినేటర్ డా.యశస్వి సభాసంచాలకులుగా వ్యవహరించి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ప్రవేశించిన 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొని పాఠ్యాంశాలను అధ్యయనం చేస్తున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట మండలం వేదళ్లచెరువు ఎస్టీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాల్లోని గిరిజన విద్యార్థులకు మంగళవారం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో ఐఓబి రిటైర్డ్ చీఫ్ మేనేజర్ భరతం సుధాకర్ ఆర్థిక సహాయంతో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు ఇందిరా దేవి, రంగనాథ్ పాల్గొన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలకు హాజరై బాగా చదువుకోవాలని కోరారు. అనంతరం ఎంఈఓ లను ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు చంద్రవర్ధిణి, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, అంగన్వాడీ టీచర్ గంగాదేవి పాల్గొన్నారు.

వంటశాల ఆధునీకరణపై సమీక్ష

ప్రజాశక్తి - తిరుమల:

శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడానికి అన్నప్రసాద తయారీ విధానాన్ని ఆధునీకరించాలని దక్షిణ భారతదేశంలోని ప్రఖ్యాత చెఫ్‌లు, పాకశాస్త్ర నిపుణులు టీటీడీకి సూచించారు. ఈ మేరకు శాఖాపరమైన సమీక్షా సమావేశంలో భాగంగా తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, దక్షిణ భారతదేశ అసోసియేషన్ చెఫ్‌లతో కలిసి అన్నప్రసాదం, వంటశాలల ఆధునీకరణ తదితర అంశాలపై టీటీడీ ఈవో జె శ్యామలరావు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. తిరుమలలో శ్రీవారి భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదం రుచి, నాణ్యతను మెరుగు పరిచేందుకు ఏర్పాటు చేసిన ప్రముఖ వంటల తయారీ నిపుణుల కమిటీ నుండి పలు సూచనలు, సలహాలు ఆహ్వానించారు. అంతకుముందు ఈ కమిటీ మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని సందర్శించి, అన్నప్రసాదాలు వడ్డించడం, నిల్వ చేయడం, శుభ్రపరచడం తదితర కార్యకలాపాలను పరిశీలించారు. టీటీడీ ప్రతి రోజు లక్షలాది మంది భక్తులకు అందిస్తున్న అన్న ప్రసాదాలను వారు అభినందించారు. అయితే రోజు రోజుకు పెరుగుతున్న అసంఖ్యాక భక్తుల అవసరాలకు అనుగుణంగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలోని వంటశాలలను ఆధునీకరించాలని తెలిపారు. అనంతరం చెఫ్‌లు, పాకశాస్త్ర నిపుణులు తమ సూచనలను ఈవోతో పంచుకున్నారు. ఇందులో భాగంగా అన్నప్రసాద భవనంలో సేవలందిస్తున్న సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ద్వారా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, ఇన్ హౌస్ ల్యాబ్ ల ఏర్పాటు చేసి, తనిఖీ చేయడం, ఆహార పదార్థాల పరిశుభ్రత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, పరికరాల యాంత్రీకరణ, ఆహారాన్ని రుచికరంగా, వేగవంతమైన పద్ధతిలో తయారు చేయడం, ప్రతి మూడు నెలలకోసారి ఫుడ్ అనలిస్ట్ సూచనలను తీసుకోవడం వంటి అనేక సలహాలు తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై పక్కా ప్రణాళికను రూపొందించి, మరోసారి అన్నప్రసాద కార్యకలాపాలపై ఆహార నిపుణులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ సమావేశంలో సిఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్ రెడ్డి, డిప్యూటీ ఈవో రాజేంద్ర, స్పెషల్ క్యాటరింగ్ అధికారి శాస్త్రి, జిఆర్ టి గ్రూప్ ఆఫ్ హోటల్స్ సీఈఓ విజయ్ విక్రమ్ కోటా, ప్రఖ్యాత చెఫ్, ప్రెసిడెంట్ – సౌత్ ఇండియా చెఫ్స్ అసోసియేషన్ డాక్టర్ దామోదరన్, చెఫ్ తిరులోగచందర్, ఇండియన్ క్యులినరీ ఇన్‌స్టిట్యూట్ –తిరుపతి హెడ్ చెఫ్ శీతారామ్ ప్రసాద్, కిచెన్ కన్సల్టెంట్స్, డిజైనర్ రితేష్ చౌదరి, దీపక్, నితీష్ పాల్గొన్నారు.

ఎన్ఎంయు గౌరవాధ్యక్షులుగా ఆర్‌వీటి బాబు



ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా టీడీపీ సీనియర్ నాయకులు ఆర్‌విటి బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీ యూనియన్ నాయకులు శంకరయ్య, గిరిప్రసాద్, మల్లికార్జున, కే.రెడ్డప్ప, సాదిక్, దిలీప్‌లతో పాటు పలువురు ఆర్టీసీ యూనియన్ నాయకులు మంగళవారం కొత్త ఇండ్లలోని ఆర్వీటీబాబు ఇంటికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు శంకరయ్య మాట్లాడుతూ ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న రాష్ట్రంలోని మొత్తం ఆర్టీసీ ఉద్యోగులు వారి సంక్షేమం కోసం దశాబ్దాల క్రితం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఏర్పడిందన్నారు. పుంగనూరు ఆర్టీసీ డిపోలో అధికార పూర్వకంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ గుర్తింపబడి ఉందన్నారు. యూనియన్ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు గౌరవాధ్యక్షుడుగా ఆర్వీటి బాబు అవసరం ఎంతో ఉందన్నారు. ఆర్వీటి బాబు మాట్లాడుతూ పుంగనూరులో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు దశాబ్దాల క్రితమే కృషిచేసిన దివంగత మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డితో పాటు, ఆర్టీసీ బస్టాండ్‌కు కొట్లాది రూపాయలు విలువచేసే స్థలాన్ని విరాళంగా అందించి తమ విశాల హృదయాన్ని చాటుకున్న వెంకటరమణ రాజుల కృషి ఎంతో ఉందన్నారు. ఆర్టీసీ డిపోను ఉన్నత స్థాయిలోకి తీసుకురావడానికి తమ నేత చల్లా బాబు ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆర్వీటి బాబును ఆర్టీసీ యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు.

దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు



- 24గంటల్లోనే నిందితుడు అదుపులోకి..

ప్రజాశక్తి-వెదురుకుప్పం, కార్వేటినగరం: కార్వేటి నగరం మండలంలో దొంగతనం జరిగిన 24 గంటల్లోనే నేరస్తుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్వేటినగరం సర్కిల్ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో నగరి డీఎస్పీ కేవన్ మూర్తి మాట్లాడుతూ జూలై 7వ తేదీన ఉదయం 10:30 గంటల సమయంలో కార్వేటినగరానికి చెందిన మహబూబ్ బాషా ఇంట్లో దొంగతనం జరిగిందని ఫిర్యాదు అందిందన్నారు. అనంతరం సిఐ సత్యబాబు సిబ్బందితో కలిసి దర్యాప్తు చేయగా పాత సంత వీధికి చెందిన జాఫర్ అనే వ్యక్తి పైన అనుమానంతో నిఘా పెట్టి విచారించగా నేరం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుడి నుంచి రూ.5.40లక్షలు, భారీగా వెండి, బంగారం వాటి విలువ (14 లక్షల 25 వేల రూపాయలు) స్వాధీనం చేసుకొని నేరస్తుని రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. నేరం జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించిన సిఐ సత్యబాబు, వారి సిబ్బందిని ఎస్పీ అభినందించారని డీఎస్పీ మూర్తి తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉందాం..



- నాయకులకు ఎమ్మెల్యే సూచన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని గోనుమాకులపల్లిలో పలు పంచాయతీలకు చెందిన ముఖ్య నేతలతో కలసి ఆయన ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అన్ని పథకాలు లబ్ధిదారులకు చేరువ కావాలన్నారు. ప్రజలకు సేవ చేయడాన్ని నాయకులు బాధ్యతగా భావించాలన్నారు. పంచాయతీల వారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి తెలియజేస్తే వాటి పరిష్కారానికి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసుకుందామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకునేందుకు తన వంతు కృషి చేస్తానని అందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. సమావేశంలో నాయకులు విజయభాస్కర్ రెడ్డి, ఆనంద్ కుమార్, చెంగారెడ్డి, రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలకు ఉచిత కరాటే శిక్షణ



ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని విజలాపురంలో గల కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలోని బాలికలకు ధార్మిక్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణా తరగతులు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు. సిఐ మాట్లాడుతూ సమాజంలోని ప్రతికూల పరిస్థితులను తట్టుకుని నిలబడాలంటే చదువుతో పాటూ కరాటే నేర్చుకుంటే ఆరోగ్యం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. దానితో పాటు విపత్కర పరిస్థుతులు ఎదురైనప్పుడు మానాన్ని, ప్రాణాన్ని కాపాడుకోవడానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. కావున ఈ అవకాశాన్ని విద్యార్థినులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ధార్మిక్ సేవా సమితి అధ్యక్షులు విజలాపురం మహేష్, కరాటే మాస్టర్ ఏకాంబరం, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జొన్నల పశుగ్రాసాన్ని ఉపయోగించుకోవాలి



- డాక్టర్ అసిఫ్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పాడి పశువులకు జొన్నల పశుగ్రాసాన్ని అందించాలని సహాయ సంచాలకులు డాక్టర్ ఆసిఫ్ అన్నారు. మంగళవారం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో పాడి పశువుల రైతులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మొదటి రెండు సంవత్సరాల మొక్కజొన్న పైరు అధిక శక్తి గల ప్రోటీన్లు పాడి ఆవులకు లభిస్తాయని వాటిని ఉపయోగించడం వలన పాడి ఆవులు దృఢంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పశువైద్య కేంద్ర సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

అనాధ మృతదేహానికి అంత్యక్రియలు



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రమాదంలో గాయపడి మృతి చెందిన అనాధ శవానికి బంగారుపాళ్యం ముస్లిం జేఏసీ సభ్యులు దాన సంస్కారాలు చేపట్టినట్టు మండల జేఏసీ అధ్యక్షులు ఫిరోజ్ అహ్మద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం, మొగిలి దగ్గర రోడ్డు ప్రమాదంలో శరీర భాగాలు వేరు వేరు అయ్యి ఒక వృద్ధుడు మృతి చెందిన సంఘటన జరిగింది. మంగళవారం వరకు శవం తాలూకాకు సంబంధించిన వ్యక్తులు ఎవరు రాకపోవడంతో బంగారుపాళ్యం అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐ లక్ష్మయ్య, ఎస్ఐ మల్లికార్జున్ ఆదేశాల మేరకు బంగారుపాళ్యం ముస్లిం జేఏసీ అధ్యక్షు ఫిరోజ్ అహ్మద్ ఆధ్వర్యంలో తగ్గువారిపల్లి శ్మశాన వాటికలో అనాధ శవానికి ముస్లిం జేఏసీ సొంత ఖర్చులతో వారి హిందూ సాంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ ద్వారక, వైస్ ప్రెసిడెంట్ లాలు, ముస్లిం జేఏసీ కోశాధికారి షంషీర్, ముస్లిం జెఏసి, సభ్యులు రియాజ్ బాషా, ఫిరోజ్, సమీర్, మాలిక్, మొగిలి పంచాయతీ కార్యదర్శి చంగల్రాయ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలకు ఉచిత పోషక ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మహతి ఫౌండేషన్ వారి సహకారంతో గర్భిణీలకు ఉచిత పోషక ఆహారం పంపిణీ చేపట్టారు. ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 9వ తేదీన డాక్టర్ విజయచంద్ర ఆధ్వర్యంలో గర్భిణులకు సూచనలు, సలహాలు, వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో అక్కడికొచ్చిన గర్భిణులకు ఆరోగ్య సిబ్బందికి ఉచిత పోషక ఆహారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయచంద్ర, శాలిని. మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు

- ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి సబ్‌స్టేషన్‌కు సమీపంలో బైక్‌పై వస్తున్న వ్యక్తిని కర్ణాటక ఆర్‌టీసీ బస్సు ఢీకొంది. సంఘటనలో ఆ వ్యక్తి అక్కడి కక్కడే మృతి చెందాడు. వివరాలు.. గంగాధరనెల్లూరు మండలం ముసలయ్యగారిపల్లె గ్రామానికి చెందిన పద్మనాభరెడ్డి(55) బైక్లో చిత్తూరుకు వెళ్ళి అక్కడ నుంచి తిరిగి వస్తుండగా, బలిజ కండ్రిగ నుంచి బెంగళూరుకు బయలుదేరిన కర్ణాటక బస్సు వేపంజేరి సబ్ స్టేషన్ వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో పద్మనాభరెడ్డి అక్కడ అక్కడే మృతి చెందారు. గంగాధరనెల్లూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

